సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ; 23 ; జనవరి ; 2024



వైద్యారోగ్య శాఖలో..

వైద్యారోగ్య శాఖలో రచ్చరచ్చ జరుగుతోంది. ఇద్దరు ఉద్యోగుల కారణంగా విమర్శలు రేగుతున్నాయి.

- 10లో



శ్రీకాకుళం నగరంలో ఊరేగింపులో ఉత్సవ మూర్తులు

న్యూస్‌రీల్

ఇంటింటికీ ఇంటర్నెట్ సాకర్యం

శ్రీకాకుళం: ఇంటింటికీ ఇంటర్నెట్ బృహత్తర ప్రభుత్వం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) సంస్థ మేనేజర్ ఎల్.గౌతమ్ కుమార్ కేబుల్ ఆపరేటర్లకు సూచించారు. శ్రీకాకుళం జిల్లా సంస్థ కార్యాలయంలో కేబుల్ ఆపరేటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఇంటర్నెట్ సదుపాయం అందించాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అతి తక్కువ ధరలకు ఇంటర్నెట్ సౌకర్యం, ట్రిపుల్ ప్లే సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క చానెల్, మూవీలు యాప్‌లలో రాబోతున్నందున, ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఓఎల్‌టీల ద్వారా ట్రిపుల్‌ప్లే సర్వీస్‌లు అందించనున్నట్లు తెలిపారు.

స్పందనకు 175 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 175 అర్జీలు అందాయి. అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు అన్నారు. ఆయనతో పాటు ఉప కలెక్టర్ జయదేవి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, ఉద్యాన శాఖ ఏడీ ఆర్‌వీ ప్రసాదరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవ రావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 31 అర్జీలు



బాధితుని సమస్య వింటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రజా సమస్యలకు పూర్తి స్థాయిలో చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి 31 అర్జీలను ఎస్పీ స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలు అర్జీలు అందుకున్నారు.

'వైఎస్సార్ ప్రతిష్టను దిగజార్చవద్దు'



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రాష్ట్రంలో వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విపక్షాలు అనేక కుట్రలు పన్నుతున్నాయని, అందులో భాగమే షర్మిల రంగ ప్రవేశమని నరసన్నపేట ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చంద్రబాబు మరో అస్త్రమే షర్మిల అని అనుమానం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం ఉదయం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ అభిమానుల ఓట్లు చీలితే తనకు కొంతైనా ప్రయోజనం కలుగుతుందని చంద్రబాబు భావిస్తున్నారని అన్నారు. అందుకే పచ్చ పత్రికలు షర్మిలను అందలం ఎక్కిస్తున్నాయని విమర్శించారు. ఎప్పుడూ వైఎస్సార్ కుటుంబాన్ని విమర్శించే పచ్చ పత్రికలు ఇప్పుడు ఆమె గురించి గొప్పగా రాయడం బాబు పన్నాగమేనని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ ప్రతిష్టను దిగజార్చే పనులు చేయవద్దని షర్మిలకు హితవు పలికారు. ఆమె అంటే తమకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. చంద్రబాబును ఎలాగైనా సీఎం చేయాలనేదే ఆమె లక్ష్యంగా కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. వైఎస్సార్ మరణానంతరం ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ ఎన్ని ఇబ్బందులు పెట్టిందో మరిచి పోయావా షర్మిలమ్మా.. అని ప్రశ్నించారు. ఏపీని అడ్డగోలుగా విభజించింది కాంగ్రెస్ కాదా.. ప్రస్తుత రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం కాంగ్రెస్ కాదా అని అన్నారు. తెలంగాణలో ఉన్న ఆమె అకస్మాత్తుగా ఏపీకి ఎందుకు రావాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ జగనన్నే సీఎం అవుతారని అన్నారు.



జి.సిగడాం: మర్రివలసలో దీపారాధన



శ్రీకాకుళంలో కళాకారుల కోలాట ప్రదర్శన

వందే రామం జగద్గురుం

ఇళ్లలోనే కాదు భక్తుల కళ్లలోనూ ఆనంద దీపాలు వెలిగాయి. గొంతులే కాదు గుండెలు కూడా శ్రీరాముడి నామాన్ని జపించాయి. మనుషులు మాత్రమే ఇక్కడ ఉన్నారు. మనసులన్నీ అయోధ్యపైనే లగ్నమై ఉన్నాయి. ఐదు వందల ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించిన వేళ.. వాకిళ్లు కోవెళ్లుగా మారాయి. వీధులు అయోధ్యను తలపించాయి. దశరథ నందనుడి నామాలే తారక మంత్రాలై ప్రతిధ్వనించాయి. సొంతింటిలో బాల రాముడి ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీకాకుళం సంబరం చేసుకుంది. అయోధ్య వెళ్లలేకపోయిన వెలితిని వేడుక చేసుకుని తీర్చుకుంది.



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో భక్తి పారవశ్యంతో రామనామ సంకీర్తనలు పాడుతున్న బాలికలు



కాశీబుగ్గ: ర్యాలీలో మంత్రి సీదిరి అప్పలరాజు



పాతపట్నం: శ్రీరామ పాదుకాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో భక్త జన సంద్రంలో ఊరేగుతున్న ఆదర్శమూర్తి



వజ్రపుకొత్తూరు రూరల్: సీతారాముల వేషధారణ



శ్రీకాకుళం రూరల్: రామబాణం ఆకృతిలో కూర్చున్న గురజాడ విద్యార్థులు

నేడు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు మహిళ స్వయం శక్తి సంఘాలకు అప్పటి వరకు ఉన్న బ్యాంకు రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరాతో హామీని నెరవేర్చారు. ఇప్పటికే మూడు విడతల నగదు అందజేసిన ప్రభుత్వం, మంగళవారం నాలుగో విడతను అందజేయనుంది.



- తొలి విడతలో డీఆర్‌డీఏ, మెప్మాల్లో ఉన్న 40,173 సంఘాల్లోని 4,48,039 మంది సభ్యులకు గాను రూ. 292.31 కోట్లు అందజేశారు.
- రెండో విడతలో మెప్మా, డీఆర్‌డీఏలోని 40,336 సంఘాల్లో 4,33,626మంది సభ్యులకు రూ. 294.28 కోట్లు అందజేశారు.
- మూడో విడతలో మెప్మా, డీఆర్‌డీఏలోని 40,326 సంఘాలకు గాను 4,33,748 సభ్యులకు రూ. 293.18 కోట్లు అందజేశారు.
- నాల్గో విడతలో దాదాపు 40,360 సంఘాల్లోని 4,34,048 మంది సభ్యులకు రూ.293.26 కోట్లు విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు.

ఏర్పాట్లు పూర్తి

మహిళల రుణమాఫీ (ఆసరా)నాలుగో విడతను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించి ఉదయం 10 గంటలకు స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఆసరా నాల్గో విడత సంబరాలు జరగనున్నాయి. దీంతో మహిళలకు ఇచ్చిన హామీ మేర వారి రుణమాఫీని పూర్తిగా ప్రభుత్వం చెల్లించినట్టే.

– డాక్టర్ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

వైద్య సేవలపై ఆరా

టెక్కలి: ప్రభుత్వ లక్ష్యం మేరకు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ అవసరమైన వైద్య సేవలను మెరుగ్గా అందజేయాలని జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం స్పష్టం చేశారు. టాస్క్‌ఫోర్స్ సభ్యులు ప్రాజెక్టు నిర్వాహణాధికారి వెంకటలక్ష్మి, గణాంకాధికారి రామనాగేశ్వరరావు, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి మురళి, డీపీహెచ్ఎన్ఓ శైలజ తదితరులు సోమవారం టెక్కలి మండలం లింగాలవలస పీహెచ్‌సీను పరిశీలించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందజేయాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరితో పాటు పీహెచ్‌సీ వైద్యుడు కె.సాయితేజ, భాగ్యశ్రీ, జ్యోతి, సిబ్బంది అప్పారావు, జయలక్ష్మి, శకుంతల, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి మండలం లింగాలవలస పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

జిల్లాలో ఓటర్లు 18,59,910 మంది



- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- నామినేషన్ల ముగిసే వరకు మార్పులు, చేర్పులకు అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 18,59,910 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 30 మండలాల పరిధిలో 8 శాసన సభా నియోజకవర్గాలకు గాను 2357 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లలో 9,22,442 మంది పురుషులు కాగా, 9,37,329 మంది మహిళలు, ఇతరులు 139 మంది ఉన్నారని తెలిపారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు పొందారని, జిల్లాలో 18–19 సంవత్సరాల వయస్సు గల ఓటర్లు 35,037 మంది ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో ఈ విషయంలో మనం మొదటి స్థానంలో ఉన్నామని అన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ వెలువడిన 2023 అక్టోబర్ 27వ తేదీ నుంచి మార్పులు, చేర్పులు పూర్తిచేసిన తర్వాత ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి తుది జాబితాను సోమవారం విడుదల చేసినట్లు తెలిపారు. ఈ జాబితాలు ఈఆర్వో, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ, పోలింగ్ స్టేషన్ల వద్ద, బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు.

డిసెంబర్ 9వ తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తులకు మాత్రమే ఈ జాబితాలో చోటు ఉంటుందని, ఓటు హక్కు లేని వారు ఇప్పటికీ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్లు వేసేంత వరకు స్వేచ్ఛగా ఓటు కోసం, లేదా మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్కలి నియోజకవర్గంలో ఓట్లు తొలగించాలంటూ బల్క్ అప్లికేషన్లు అందజేసిన నలుగురు వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు తెలుపుతూ 44 వేల ఫిర్యాదులు వచ్చాయని అందులో దాదాపు 9100 ఫిర్యాదులు నిజమైనవని గుర్తించి పరిష్కరించామన్నారు. ఫిర్యాదులు రాక మునుపే ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది 5476 మంది ఓటర్లకు సంబంధించిన సమాచారాన్ని సరి చేశారన్నారు. జిల్లాలో ఆర్మీ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 16,100 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని, ఈ అంశంలో దేశంలో టాప్ 20 జిల్లాల జాబితాలో శ్రీకాకుళం జిల్లా కూడా ఒకటిని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో అత్యంత పారదర్శకతతో పనిచేసిన సిబ్బందిని అభినందించారు. ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు.

అభ్యంతరాలు ఉంటే చెప్పండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. ఎస్ఎస్ఆర్ 2024 విడుదల సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ పబ్లికేషన్ నుంచి ఇప్పటివరకు ఎన్నికల కమిషన్‌కి జిల్లా నుంచి పెద్దగా ఫిర్యాదులు వెళ్లలేదని, ఆయా పార్టీల సహకారంతో తుది జాబితాను ప్రచురించామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేంతవరకు ఎలాంటి సమస్యలనైనా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల ప్రతినిధులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా 80 ఏళ్లు దాటిన ఓటు వేసేందుకు కష్టంగా ఉండే పరిస్థితుల్లో ఉపయోగపడే 12డి దరఖాస్తుల గురించి ఆయన వివరించారు. ఎస్ ఎస్ ఆర్ 2024 రూపకల్పనలో జిల్లా యంత్రాంగం ఎంతో సమర్థంగా పని చేసిందని, ప్రత్యేకంగా కలెక్టర్ చూపిన చొరవ మర్చిపోలేనిదని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రొౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), సురేష్ బాబు సింగ్ (బీజేపీ) పిఎంజె బాబు (టీడీపీ), దేసెళ్ల మల్లిబాబు (కాంగ్రెస్), బి.నారాయణ రావు (బీఎస్పీ), లాసా గోవిందు, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు, ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లెయిముల వివరాలు

- 8 నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేక సమ్మరీలో ఫారం-6లు 65,621, ఫారం 6ఏలు 9, ఫారం-8లు 22,893 అందాయి.
- తొలగింపులకు సంబంధించి 8 నియోజకవర్గాల్లో పరిశీలిస్తే, 55,755 ఓటర్లను తొలగించారు. వీటిలో చనిపోయిన వారు 18,215, మరొక చోటుకి బదిలీ అయినవారు 30,754, డూప్లికేట్(రెండో చోట్ల ఉన్నవారు) 6786 ఓటర్లు ఉన్నారు.

ఎన్ఆర్ఐ, సర్వీసు ఓటర్ల వివరాలు..

- జిల్లాలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎన్ఆర్ఐ ఓటర్లు 11మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 1930 మంది ఉన్నారు.
- పలాసలో ఎన్ఆర్ఐ ఓటర్లు ఒక్కరు ఉండగా సర్వీసు ఓటర్లు 2976 మంది ఉన్నారు.
- టెక్కలిలో ఎన్ఆర్ఐ ఓటర్లు 16 మంది కాగా, సర్వీసు ఓటర్లు 2865 మంది.
- పాతపట్నంలో ఎన్ఆర్ఐ ఓటర్ల సంఖ్య 9, సర్వీసు ఓటర్ల సంఖ్య 1818.
- శ్రీకాకుళంలో ఎన్ఆర్ఐ ఓటర్లు 23 మంది, సర్వీసు ఓటర్లు 1238 మంది.
- ఆమదాలవలసలో ఎన్ఆర్ఐ ఓటర్లు నలుగురు, సర్వీసు ఓటర్లు 2207 మంది ఉన్నారు.
- ఎచ్చెర్లలో ఎన్ఆర్ఐ ఓటర్లు ముగ్గురు, సర్వీసు ఓటర్లు 901 మంది ఉన్నారు.
- నరసన్నపేటలో ఎన్ఆర్ఐ ఓటర్ల సంఖ్య 3, సర్వీసు ఓటర్ల సంఖ్య 2165.

వయసుల వారీగా ఓటర్ల వివరాలు..

వయసు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
18–19	19,883	15,152	2	35037
20–29	1,63,786	1,46,948	23	3,10,757
30–39	2,48,949	2,38,901	62	4,87,912
40–49	1,96,527	2,07,114	26	4,03,667
50–59	1,44,370	1,61,167	13	3,05,550
60–69	92,704	1,00,583	8	1,93,295
70–79	44,314	50,331	5	94650
80–89	10783	15135	0	25918
90–99	1107	1967	0	3074
100+	19	31	0	50

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఇచ్ఛాపురం	పలాస	టెక్కలి	పాతపట్నం	శ్రీకాకుళం	ఆమదాలవలస	ఎచ్చెర్ల	నరసన్నపేట	మొత్తం
పురుషులు	1,29,579	1,06,817	1,16,944	1,11,301	1,33,772	95,539	1,22,169	1,06,321	9,22,442
స్త్రీలు	1,36,427	1,11,365	1,17,383	1,11,843	1,36,252	97,005	1,20,455	1,06,599	9,37,329
థర్డ్ జెండర్	17	26	10	13	31	16	13	13	139
మొత్తం	2,66,023	2,18,208	2,34,337	2,23,157	2,70,055	1,92,560	2,42,637	2,12,933	18,59,910



వైద్యారోగ్య శాఖలో రచ్చరచ్చ



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

- ఉద్యోగాల పేరిట అక్రమాలు
- ఉన్నతాధికారి క్యాంపు ఆఫీసుకు అవినీతి మరక అంటించేందుకు కుట్ర
- ఇద్దరు కీలక ఉద్యోగుల ఎత్తుగడ

అరసవల్లి: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏడు వేల పైచిలుకు సచివాలయ ఉద్యోగులను నియమించింది. ఎక్కడా పైసా అవినీతి ఆరోపణ రాలేదు. వైద్యారోగ్య శాఖలో అన్నీ కలిపి రెండువేలకుపైగా పోస్టులు భర్తీ చేసింది. ఒక్క పోస్టుపై కూడా అవినీతి మరక అంటలేదు. కానీ వైద్యారోగ్య శాఖలో ఓ ఇద్దరు కీలక ఉద్యోగులు హెల్త్ అసిస్టెంట్ల నియామకాల పేరిట అక్రమంగా జేబులు నింపుకోవడమే కాకుండా.. తమ దొంగతనం బయటపడుతుందనే భయంతో తప్పును ఉన్నతాధికారులపై నెట్టేసేలా ప్రణాళిక వేశారు. తద్వారా ప్రభుత్వ విధానాలపై తప్పుడు ప్రచారం జరిగి తమను మర్చిపోతారని నీచపు ఎత్తుగడకు తెర తీశారు. స్థానిక అధికార పార్టీ నేతల సహకారంతో డీఎంహెచ్ఓ క్యాంపు కార్యాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని, ఇష్టారాజ్యంగా ఫైళ్లు క్రియేట్ చేసి సొమ్ములు చేసుకుంటున్నారంటూ ఏకంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ కార్యాలయానికి ఆకాశరామన్న లేఖలు రాశారు. దీంతో ఈ లేఖలు ఇప్పుడు జిల్లా వైద్య శాఖలో హాట్‌టాపిక్ అయ్యాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు కూడా ఆదేశించారు. వివరాల్లోకి వెళితే..

జిల్లాలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే అర్హత విషయంలో కొందరు కోర్టులను ఆశ్రయించడంతో కొద్దినెలలు నియామకాలకు బ్రేక్ పడింది. ఆ తర్వాత యథావిధిగా 32 హెల్త్ అసిస్టెంట్ల పోస్టులను జిల్లా అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్, అర్హతల ప్రామాణికంగా భర్తీ చేశారు. కానీ ఇద్దరు కీలక ఉద్యోగులు తమదైన శైలిలో వ్యవహారాన్ని నడిపి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. జాబితాలో మీ పేరు ఉందంటూ కొందరి వద్ద నుంచి అక్రమంగా డబ్బు గుంజారు. వాటాల్లో తేడాలు రావడం, కొందరు అభ్యర్థులు తిరిగి ప్రశ్నించడంతో ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులపైకి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే క్యాంపు కార్యాలయ సిబ్బంది, తద్వారా డీఎంహెచ్ఓ, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు ఈ అక్రమాల్లో వాటాలు ఉన్నాయని రాష్ట్ర కమిషనర్‌కు లేఖలు పంపించారు. ఈ లేఖల వ్యవహారమంతా డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రస్తుతం పనిచేస్తున్న అడ్మిన్ కీలక అధికారితో పాటు ఇటీవలే రిమ్స్‌లో బాధ్యతలు చేపట్టిన వైద్యాశాఖ ఉద్యోగి 'ఆచార' వ్యవహారమే అనే అనుమానాలు ఉన్నాయి. దీనిపై కూడా విచారణ మొదలైనట్లు సమాచారం.

పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ

వాస్తవానికి హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ పారదర్శకంగానే జరిగింది. కానీ ఉద్యోగం దక్కిన అభ్యర్థికి తమ వల్లనే ఉద్యోగం వచ్చిందనే కోణంలో నమ్మబలికి అడ్డదారుల్లో డబ్బులు వసూలు చేశారు. ఇదే వరుసలో గత రెండేళ్ల క్రితం ఇదే జిల్లా వైద్యారోగ్య శాఖలో పలు పోస్టుల వ్యవహారాలు రచ్చకెక్కిన విషయం తెలిసిందే. తాజాగా కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు చేరడంతో అవినీతి మచ్చ అంతా డీఎంహెచ్ఓ క్యాంపు కార్యాలయానికి అంటుకుంటుందని భావించి తప్పుడు అడ్రస్‌లతో ఆకాశ రామన్న లేఖలు పంపించారు. ఆ లేఖల్లో వాస్తవాలను బయటకు తీసేలా విచారణ సాగించాలని ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. పూర్తిస్థాయి విచారణ జరిగితే అసలు దొంగలు బయటపడే అవకాశముంది.

ఫిర్యాదులు పంపించిన మాట వాస్తవమే..



మా శాఖలో కొందరు ఉద్యోగులు అవినీతి అక్రమాలు చేస్తున్నారంటూ ఫిర్యాదుల రూపంలో ఉన్నతాధికారులకు లేఖలు పంపించారు. ఎవరు పంపించారో క్లియర్‌గా రాసిలేదు. దీన్నిబట్టి వ్యక్తిగత విభేదాల వల్లనే ఫిర్యాదులు చేసి ఉంటారని భావిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం. అలాగే జిల్లా శాఖ కార్యాలయంలో కీలక సీట్లు మార్చేలా కూడా అడుగులు వేస్తున్నాం.

– డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ

డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


గాయత్రి డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఎం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 61 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సబ్జెక్టు ఉన్న విద్యార్థులు 14,950 మంది హాజరయ్యారు. పరీక్షలు సజావుగా పూర్తయ్యేలా అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

వైఎస్సార్ సీపీలో జోరుగా చేరికలు


మంత్రి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరిన వైశ్యసంఘ యువత

కాశీబుగ్గ: సుమారు వంద కుటుంబాలకు చెందిన వైశ్య యువత వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి సీదిరి అప్పలరాజు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పలాస-కాశీబుగ్గ వైశ్య సంఘ బాధ్యులు కోట్ని విజయ, పెంట రత్నాకర్ ఆధ్వర్యంలో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడారు. పలాస నియోజకవర్గం మునుపటి కంటే నేడు అన్ని విధాలా అభివృద్ధి చెందిందని అన్నారు. వైశ్యసంఘ పెద్దలు మాట్లాడుతూ నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం భరోసా లభించిందని, తమకు అప్పలరాజే కావాలని స్పష్టం చేశారు. టీడీపీ అల్లుడి గిల్లుడు తమకు వద్దని చెప్పారు. కార్యక్రమంలో వైశ్య సంఘ పెద్దలతో పాటు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్‌కుమార్, వైస్ చైర్మన్ బోర బుజ్జి, వాణిజ్య విభాగం అధ్యక్షులు బెల్లాల శ్రీనివాసరావు, తూముల శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్, వార్డ్ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానించిన రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పాతిక కుటుంబాల చేరిక..

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి పంచాయతీలో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పెద్ద మనసు చాటుకున్న ప్రవాసాంధ్రులు


మృతుడి భార్య పుష్పకు బాండ్, నగదును అందజేస్తున్న 'పోటా' సభ్యుడు రామసతీష్

ఇచ్ఛాపురం రూరల్: ప్రవాసాంధ్రులు పెద్ద మనసు చాటుకున్నారు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన ఉప్పాడ సోమేశ్‌రెడ్డి పోలెండ్‌లో కూలి పనికి వెళ్లి అనారోగ్యంతో 2023 డిసెంబర్ 16న అక్కడే మృతి చెందాడు. వెంటనే స్పందించిన 'పోలెండ్ తెలుగు అసోసియేషన్' (పోటా) సభ్యులు అక్కడికక్కడే మృతదేహాన్ని ఖననం చేసి అస్థికలను స్వగ్రామానికి పంపించారు. 'పోటా' కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రవాసాంధ్రుడు పైలా విజయకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.3లక్షల 75లను నగదును సేకరించారు. రూ.3లక్షల 50వేలను ఎస్‌బీఐ లైఫ్ బాండ్ రూపంలో, పాతిక వేలు నగదును 'పోటా' కమిటీ సభ్యుడు రామసతీష్ సోమవారం ఇండియా వచ్చి ధర్మపురంలో మృతుడి భార్య ఉప్పాడ పుష్ప, 8 నెలలు కుమార్తె కావ్యశ్రీకి గ్రామ పెద్దలు సమక్షంలో అందజేశారు. పెద్ద దిక్కు కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన పోలెండ్ తెలుగు అసోసియేషన్ సభ్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

35 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో అక్రమంగా పాన్ షాపులో అమ్ముతున్న 35 మద్యం బాటిళ్లను సోమవారం ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీజ్ చేసి, అనంతరం అమ్ముతున్న మహిళపై కేసు నమోదు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చురుగ్గా కులగణన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కుల గణన చురుగ్గా సాగుతోంది. నాలుగో రోజు సోమవారం కులగణన మరింత వేగం అందుకుంది. 732 సచివాలయాల పరిధిలోని 11,955 క్లస్టర్లలో 3,26,595 కుటుంబాలను సందర్శించారు. 7,65,335 మందిని గణన చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా ఉద్యోగి దుర్మరణం


ఉమా మహేశ్వరి (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.ఉమామహేశ్వరి (62) సోమవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. శ్రీకాకుళం గుజరాతీపేటలో ఉంటున్న ఆమె సోమవారం కాలేజీకి ఆటోలో వెళ్లి, కళాశాల గేటు ముందు దిగారు. రోడ్డు దాటుకుని వస్తుండగా అటుగా వేగంగా వస్తున్న బైక్ ఆమెను ఢీకొట్టింది. ఆ ధాటికి తలకు బలమైన గాయాలై ఘటనా స్థలంలోనే ఊపిరి వదిలేశారు. స్థానికులు సహాయ చర్యలకు ప్రయత్నించినా ఆమెను కాపాడలేకపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన బైక్ చోదకుడిని అదుపులోకి తీసుకున్నారు. గుజరాతీపేటలో నివాసం ఉంటున్న ఉమామహేశ్వరికి భర్త మృతితో ఈ ఉద్యోగం లభించింది. అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు పొందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉద్యోగి మృతిపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌డీఎల్‌పీ క్రిస్టియన్, సిబ్బంది సంతాపం తెలియజేశారు. సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారమే కాలేజీ పునః ప్రారంభించారు. అదే రోజు ఉద్యోగి చనిపోవడంతో కళాశాలలో విషాదం అలముకుంది.

'పారదర్శకంగా విధులు నిర్వహించాలి'


నాన్ టీచింగ్ స్టాఫ్ సమీక్షలో మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో సోమవారం నాన్ టీచింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ముందుగా రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య బోధనేతర సిబ్బంది వివరాలు వెల్లడించారు. అన్ని విభాగాల్లో 197 మంది ఉద్యోగులు ఉన్నట్లు వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఉద్యోగులు వర్సిటీ ప్రగతిలో భాగం కావాలని చెప్పారు. వర్సిటీ పనివేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు వరకు తప్పని సరిగా సమయపాలన పాటించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని, తాను కూడా స్థానికంగా ఉంటూ విధులు నిర్వహిస్తానని తెలిపారు. అన్ని విభాగాల పనితీరును నిరంతరం సమీక్షిస్తానన్నారు. అవినీతి రహిత పాలన లక్ష్యమని చెప్పారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


లక్ష్మణరావు మృతదేహం వద్ద టూటౌన్ ఎస్ఐ లక్ష్మి

శ్రీకాకుళం క్రైమ్ : బైరివానిపేటకు చెందిన బంగారు లక్ష్మణరావు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మద్యపానంపై కుటుంబ సభ్యులు ప్రశ్నించినందుకు ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. బైరివానిపేటకు చెందిన లక్ష్మణరావు తాపీమేస్త్రీ పని చేస్తూ భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు సంతోష్‌కుమార్, తేజేశ్వరరావులతో కలిసి జీవిస్తున్నారు. కుమారులకు వివాహాలు అయిపోయాయి. లక్ష్మణరావుకు మొదటి నుంచీ మద్యం తాగే అలవాటు ఉండేది. కుటుంబ సభ్యులంతా మానేయమని ప్రాధేయపడేవారు. ఈ క్రమంలో ఆయన ఈ నెల 16న తన అత్తవారి గ్రామమైన ఎం.సింగుపురం వెళ్లారు. 19న పనికెళ్తానని చెప్పి ఒక్కడే ఇంటికి వచ్చేశారు. ఆ తర్వాతి రోజు సరస్వతి, సంతోష్, తేజేష్‌లు వచ్చి చూసేసరికి లక్ష్మణరావు పనికి వెళ్లకుండా మద్యం మత్తులో పడుకుని ఉన్నారు. సాయంత్రం లక్ష్మణరావు లేచాక సరస్వతి మందలించడంతో బయటకు వెళ్లిపోయి తిరిగి రాత్రి 7.40గంటలకు వచ్చి పెరడు కెళ్లి గడ్డిమందు తాగారు. వెంటనే కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఈ నెల 21న విశాఖ తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి చెప్పారు.

అదుపు తప్పిన లారీ

టెక్కలి రూరల్:

మండలంలోని కె.కొత్తూరు గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ఒక ట్యాంకర్ లారీ అదుపు తప్పి సమీప గ్రామంలోని ఇళ్ల మధ్యలోకి దూసుకు పోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కటక్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఏపీ31టిఎఫ్1638 నంబర్ గల తారు ట్యాంకర్ లారీ కె.కొత్తూరు గ్రామం వద్ద గల ఫ్లై ఓవర్ వంతెన ఎక్కుతుండగా తన ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో ఆ లారీని ఢీకొట్టి ఫ్లై ఓవర్ పై నుంచి గ్రామంలోకి దూసుకుపోయి సమీప విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనలో కటక్‌కు చెందిన లారీ డ్రైవర్ అరుణ్ బెహరాకి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదకరంగా ఇళ్ల మధ్యలోకి దూసుకుపోయిన ట్యాంకర్

క్లుప్తంగా

స్వల్పకాలిక కోర్సులతో మహిళలకు ఉపాధి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని నందమూరి తారక రామారావు నైపుణ్య అభివృద్ధి, మహిళా సాధికార కేంద్రంలో మూడు నెలల స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణలకు మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మేనేజర్ కె.పార్వతి తెలిపారు. శిక్షణ కేంద్రంలో సోమవారం వివరాలు వెల్లడించారు. 10వ తరగతి పాస్, ఫెయిల్ విద్యార్హత గల 18 నుంచి 40 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని చెప్పారు. ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీషియన్‌తో పాటు పలు ఉపాధి కోర్సుల్లో శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 31లోపు ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విద్యార్హత, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తులకు జతచేయాలని చెప్పారు. కోర్సులు, ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 8333921337, 7416764419ను సంప్రదించాలని సూచించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఏసీబీ కోర్టు న్యాయమూర్తి


ఆదిత్యుని జ్ఞాపికను న్యాయమూర్తి మురళీకృష్ణ దంపతులకు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ని విశాఖపట్నం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి మురళీకృష్ణ సతీసమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను అర్చకులు న్యాయమూర్తికి వివరించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి, అర్చకులు సాందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పీసీసీ చీఫ్ షర్మిల పర్యటన నేడు

శ్రీకాకుళం: పీసీసీ చీఫ్ పదవీ బాధ్యతలు చేపట్టిన షర్మిల తొలిసారి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పర్యటన విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంకు షర్మిల చేరుకుంటారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర విజయోత్సవ చిహ్నం వద్ద నివాళులర్పించి, జేఆర్ పంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని శ్రీకాకుళం ఆర్డీఓ(ఇఆర్ఓ) సీహెచ్ రంగయ్య సోమవారం వెల్లడించారు. ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో ఓటర్ లిస్ట్ (ఫైనల్ రోల్) శ్రీకాకుళం నియోజకవర్గంలోని 279 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ చేయడం జరిగిందని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. ఓటర్లు తమ పేర్లను పరిశీలించి తమ పేర్లు ఉన్నదీ లేనిదీ చూసుకోవాలన్నారు. శ్రీకాకుళం తహసీల్దార్ (ఏఈఆర్ఓ) కె.వెంకటరావు పాల్గొన్నారు.

శంబర సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

- నేడే పోలమాంబ సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 2.30–3 గంటల మధ్యలో సిరిమానోత్సవం ప్రారంభం
- మూడు లక్షలమందికి పైగా భక్తులు వస్తారని అధికారుల అంచనా
- ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం




సుందరంగా ముస్తాబైన శంబర పోలమాంబ ఆలయం


సిద్ధమైన సిరిమాను బండి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరానికి వేళయింది. ముహూర్తం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల మధ్యలో సిరిమానోత్సవం ప్రారంభంకానుంది. పూజారి జన్నిపేకాపు భాస్కరరావు సిరిమానును అధిరోహించనున్నారు. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు పూర్తిచేశారు. సిరిమాను, సిరిమాను బండిని సోమవారం సాయంత్రానికే సిద్ధం చేశారు. అమ్మవారి సిరిమానోత్సవంలో రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు సుమారు 3 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు 150 బస్సులను నడుపుతోంది. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో 700 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. వీరిలో నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు ఉన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి జాతరను పర్యవేక్షిస్తారు. ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విధుల నిర్వహణపై సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

క్యూ కాంప్లెక్స్‌లు

దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.వి.వి ప్రసాదరావు పర్యవేక్షణ, ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధానాలయం, వనంగుడి వద్ద ఉచిత, రూ.20, రూ.100 టిక్కెట్ కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లను ఏర్పాటుచేశారు. భక్తులకు ఎండ తగలకుండా ఉండేందుకు షామియానాలు వేశారు. క్యూలలో చిన్నపిల్లలకు పాలు అందించనున్నారు. 30 వేలు లడ్డూప్రసాదాన్ని తయారుచేశారు. భక్తులకు అవసరమైనంత వీలుగా పులిహోర ప్రసాదాన్ని తయారు చేయించారు. వనంగుడి, చదురుగుడి అవుట్‌గేట్‌వద్ద, వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు వినోదాన్ని అందించేందుకు మంగళవారం రాత్రి విశాఖపట్నానికి చెందిన ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు.

తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు..

జాతరకు వచ్చిన భక్తులు కాలకృత్యాలను తీర్చుకునేందుకు వీలుగా గోముఖీనది ఒడ్డున 40 తాత్కాలిక మరుగుదొడ్లు, రెండు చోట్ల మహిళల వస్త్ర మార్పిడి గదులను ఏర్పాటుచేశారు. భక్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు, ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి భక్తులు చేరుకునేందుకు వీలుగా రూట్‌మ్యాప్‌లను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

జాతరలో 120 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిమగ్నమయ్యారు. డీఎల్‌పీఓ బి.సత్యనారాయణ పారిశుద్ధ్య పనులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. జాతర ప్రాంతంలోని వ్యర్థాలను కార్మికులు వెంటవెంటనే తొలగిస్తున్నారు.

నాలుగుచోట్ల కంట్రోల్‌రూమ్‌లు

గ్రామంలోని చదురుగుడి, వైఎస్సార్ విగ్రహం, వనంగుడి, జెడ్పీహెచ్ఎస్ వద్ద నాలుగు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. కంట్రోల్‌రూమ్‌లు వద్ద తహసీల్దార్ల పర్యవేక్షణ ఉంటుంది.

బస్సు సర్వీసులు ఇలా..

పార్వతీపురం, సాలూరు, విజయనగరం, శ్రీకాకుళం, ఎస్.కోట, పాలకొండ డిపోల నుంచి సుమారు 150 బస్సులను జాతర సందర్భంగా ఆర్టీసీ అధికారులు నడపనున్నారు. భక్తుల రద్దీని బట్టి అవసరమైతే అదనపు సర్వీసులను పెంచనున్నట్టు అధికారులు తెలిపారు.

ఐదు చోట్ల వైద్యశిబిరాలు

గ్రామంలోని వనంగుడి వద్ద, క్యూలైన్లు, అంగన్‌వాడీకేంద్రం, పీహెచ్‌సీ, రామమందిరం వద్ద వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో ఏడుగురు వైద్యాధికారులతో పాటు, సుమారు 50 మంది పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

తాత్కాలిక బస్టాండ్‌లివి...

- సాలూరు ప్రాంతం నుంచి వచ్చిన బస్సులను వనంగుడివద్ద, పార్వతీపురం, బొబ్బిలి వైపు నుంచి వచ్చిన బస్సులను జెడ్పీ హైస్కూల్ ఆవరణ నుంచి రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే అదే ప్రదేశం వద్ద టిక్కెట్ కౌంటర్లను ఏర్పాటుచేశారు.